కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -223 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 24-08-2026 సోమవారం పేజీలు : 4

# టీ కాంగ్రెస్‌లో పదవుల పండుగ!



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల భర్తీకి రంగం సిద్ధమవుతోంది. పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడుతున్న కార్యకర్తలకు పదవుల్లో పెద్దపీట వేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. వచ్చే సెప్టెంబర్‌లోనే రాష్ట్రంలోని నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.

80 శాతం పాత కార్యకర్తలకే..

నామినేటెడ్ పదవుల భర్తీలో 80-20 ఫార్ములా అమలు చేయనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. మొత్తం భర్తీ చేయనున్న పదవుల్లో 80 శాతం పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన పాత, నిబద్ధత కలిగిన కార్యకర్తలకు కేటాయిస్తామని తెలిపారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు.

మిగతాది 2 లో..

- సెప్టెంబర్‌లో పదవుల జాతర!
- 80 శాతం వారికే ఛాన్స్!
- పాత కేడర్‌కు భారీ గిఫ్ట్!
- కొత్త నేతలకు 20 శాతం!
- కష్టానికే కుర్చీ.. క్లారిటీ!
- పదవులపై ఆశావహుల చూపు!
- సిఫారసులకు చెక్.. సేవలకే ఓటు!
- 100 సీట్లపై కాంగ్రెస్ గురి!
- కేడర్‌లో మళ్లీ జోష్!

# 'రిజర్వేషన్ హఠావో'పై చిరాగ్ ఫైర్

- జర్వేషన్లు దానం కాదు
- రద్దు చేయడం అంత ఈజీ కాదు
- రాజ్యాంగం కల్పించిన హక్కు
- సామాజిక న్యాయానికి కీలక సాధనం
- తరతరాల వివక్షకు పరిష్కారం
- ఎస్సీ, ఎస్టీలకు అండగా రిజర్వేషన్లు
- విద్యార్థులతో చర్చించాలి




2 లో

**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్):** జంతర్ మంతర్ వద్ద 'రిజర్వేషన్ హఠావో' పేరుతో ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లు ఏమీ దానం కాదని అవి ఎవరి డిమాండ్ మేరకో రద్దు చేసేది కాదన్నారు. పాట్నాలో మీడియాతో మాట్లాడిన ఆయన..

# హైదరాబాద్‌కు వచ్చాక అన్నీ చెబుతా!



2 లో

**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు బయలుదేరారు. కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడం వల్లనే తన అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆయన ఆరోపించారు.

# రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్!

- యూనిఫారాల నాణ్యతపై హరీశ్ ఫైర్
- చినిగిన యూనిఫారాలు.. సర్కార్‌పై ప్రశ్నలు
- అంతర్జాతీయ ప్రమాణాలివేనా?
- కొలతలు లేవు.. నాణ్యత లేదు!
- దళారులపై ప్రేమ.. చేనేతపై నిర్లక్ష్యం
- నాసిరకం యూనిఫారాలపై విచారణ జరపాలి
- 'మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు'



2 లో

**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫారాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులకు అందజేసిన స్కూల్ యూనిఫారాలు అప్పుడే చినిగిపోవడం, మరి కొన్ని చోట్ల సరైన కొలతలు లేకుండా అందజేయడం పట్ల హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు.

# కవిత పార్టీకి గ్లోబల్ టచ్!



2 లో

- విదేశాల్లో టీఆర్ఎస్ విస్తరణకు శ్రీకారం
- 14 దేశాలకు పార్టీ అధ్యక్షుల నియామకం
- గ్లోబల్‌గా పార్టీ బలోపేతంపై కవిత ఫోకస్
- తెలంగాణ బిడ్డలను ఏకం చేయడమే లక్ష్యం
- ఆస్ట్రేలియా నుంచి ఐర్లాండ్ వరకు అధ్యక్షులు
- మహారాష్ట్రకు సైతం కొత్త అధ్యక్షుడు
- విదేశీ శాఖలపై కవిత కీలక నిర్ణయం
- ప్రపంచవ్యాప్తంగా టీఆర్ఎస్ నెట్‌వర్క్
- పార్టీ విస్తరణకు కవిత దూకుడు

# కంపించిన జపాన్.. భయంతో జనం!



2 లో

- తెల్లవారుజామున ఒక్కసారిగా భారీ ప్రకంపనలు
- టోక్యో సహా పలు ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం
- 25 మందికి పైగా గాయాలు.. పెరిగే అవకాశం
- రోడ్లు పగిలి.. విద్యుత్ సరఫరాకు అంతరాయం
- రైలు సర్వీసులు నిలిచిపోయి ప్రయాణికుల అవస్థలు
- సునామీ ముప్పు లేదని అధికారుల స్పష్టత

# సురేఖకు ఓబీసీ అండ!

- కొండా సురేఖకు ఓబీసీ సంఘం అండ
- కాంగ్రెస్ రచ్చలోకి ఓబీసీ ఎంట్రీ
- సురేఖకు అన్యాయం జరిగితే ఊరుకోం
- రాహుల్ ఇంటి ముట్టడికి వార్నింగ్
- సురేఖపై కుట్ర జరుగుతోందన్న ఆరోపణ
- రాజగోపాల్ రెడ్డికి నోటీసులపై సవాల్



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల మధ్య కోల్డ్ వార్ తారాస్థాయికి చేరుతోంది. మంత్రి కొండా సురేఖ, నేత చిన్నారెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో సాగుతున్న విమర్శలు, ప్రతివిమర్శలతో గాంధీభవన్ రాజకీయాలు వేడెక్కాయి. క్రమశిక్షణా నోటీసులపై మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డి వీరిద్దరూ ఇప్పటికే తమ వివరణ ఇచ్చినప్పటికీ వీరి వ్యవహారశైలిపై కొందరు కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. దీంతో ఈ విమర్శలను కొండా, చిన్నారెడ్డి వర్గీయులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. దీంతో పార్టీలో అంతర్గత రాజకీయాలు రచ్చగా మారాయి.

**కొండా లేఖకు మంత్రి వాకిటి కౌంటర్:**

తనపై, తన కుటుంబంపై కొందరు ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కమిటీ చైర్మన్ మల్లు రవికి మరో లేఖ రాశారు. తనను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. దీంతో కొండా సురేఖ లేఖపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు

2 లో


# మహిళను చంపి ముక్కలు.. కుక్కర్‌లో బిర్యానీ!

- రైలు బోగీలో మానవ శరీర భాగాలు
- 350 సీసీ కెమెరాలతో నిందితుల గుర్తింపు
- ఇంట్లో అడుగుపెట్టిన పోలీసులకు షాక్
- కుక్కర్‌లో మానవ మాంసం.. బిర్యానీ వండారా?
- భార్యాభర్తలే కలిసి దారుణ హత్య
- మృతదేహానికి తల కోసం పోలీసుల గాలింపు
- చెన్నై నుంచి ఆగ్రా వరకు కలకలం
- హయాత్ నిషా హత్యపై దర్యాప్తు ముమ్మరం

2 లో

# గచ్చిబౌలి బిల్డర్ బాగోతం బట్టబయలు!

- సాజిద్ అక్రమ సామ్రాజ్యం బట్టబయలు
- మెకానిక్ నుంచి అక్రమ బిల్డర్‌గా!
- అధికారుల అండతో అక్రమ నిర్మాణాలు
- చిన్న స్థలం.. భారీ అంతస్తులు!
- పీజీ హాస్టళ్లుగా మార్చి కోట్ల దందా
- సాజిద్ నిర్మాణాలపై హైడ్రా ఫోకస్
- అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులెవరు?
- సాజిద్ పరార్.. కేసు నమోదు
- అక్రమ భవనాలపై బుల్డోజర్ యాక్షన్
- శిథిలాల తర్వాత జి+6పై వేటు



2 లో

# చక్కెర ధరలతో జనం విలవిల!

- మూడు రోజుల్లోనే రూ.25 పెరిగిన ధర
- కిలో చక్కెర ఏకంగా రూ.75కి చేరిక
- షుగర్ ధరలతో సామాన్యుడికి షాక్
- టీ ధర కూడా అమాంతం పెంపు
- రూ.10 టీ ఇప్పుడు రూ.15
- నిత్యావసరాల ధరల పెరుగుదలతో విలవిల


2 లో

# మోడీ పిలుపు.. స్పేస్‌లో దూసుకెళ్దాం!

- అంతరిక్ష రంగంలో దూసుకెళ్తున్న భారత్
- స్పేస్ స్టార్టప్‌లకు మోదీ భరోసా
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు భారత్ హబ్
- కొత్త ఆవిష్కరణలకు మోదీ పిలుపు
- ప్రైవేట్ రంగానికి స్పేస్‌లో భారీ అవకాశాలు
- అంతరిక్షంలో 'మేక్ ఇన్ ఇండియా' జోరు
- 20 స్పేస్ స్టార్టప్‌లతో మోదీ భేటీ

2 లో

## మహిళను చంపి ముక్కలు.. కుక్కర్‌లో బిర్యానీ!



న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): దేశంలో సంచలన ఘటన చోటు చేసుకుంది. మహిళను ముక్కలు చేసిన ఓ జంట బిర్యాని వండింది. ఈ ఘటన చెన్నైలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5న చెన్నై నుండి ఢిల్లీ బయలుదేరిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు యూపీలోని ఆగ్రా రైల్వే స్టేషన్ చేరుకుంది. అక్కడ ఓ జనరల్ కంపార్ట్ మెంట్ లోని ఎరుపు రంగు బ్యాగ్ నుండి దుర్వాసన రావడంతో ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి బ్యాగును పరిశీలించగా అందులో మానవ శరీర భాగాలు ఉన్నట్టు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరగా సూట్ కేస్ చెన్నై నుండి వచ్చినట్టు తేలింది. దీంతో యూపీ పోలీసులు తమిళనాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తమిళనాడు పోలీసులు చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాల్లో దాదాపు 350 సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి ఓ పురుషుడు, మహిళ తమిళనాడు ఎక్స్ ప్రెస్ రైలుతో సూట్ కేస్ పెట్టి తరవాత సబర్బన్ రైలు ఎక్కి గూడువాంజేరి చేరుకున్నట్టు గుర్తించారు. అనంతరం వారిని ఒడిశాకు చెందిన మాణిక్ ఉత్తిన్ లస్కర్, అతడి భార్య భాగమి మాజిక్ గా గుర్తించారు. వారితో పాటు హయాత్ నిషా అనే మహిళ ఉంటున్నట్టు విచారణలో తేలింది. పోలీసులు మాణిక్ ఇంటికి వెళ్లి పరిశీలించగా తలుపులు మూసి ఉన్నాయి.

దీంతో వారు తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లి చూసి షాక్ అయ్యారు. గది అంతా రక్తపు మరకలు కనిపించడంతో పాటు వంటగదిలో కుక్కర్ లో రైస్ తో పాటు మానవశరీర ముక్కలు కనిపించాయి. రైస్ కుక్కర్ చుట్టూ మైదాపిండి చుట్టి కనిపించింది. రైస్ కుక్కర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని చెంగల్ పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ కేసు విచారణలో మాణిక్ అతడి భార్య కలిసి వారితో ఉంటున్న హయాత్ నిషాను హత్య చేసి బిర్యానీ వండినట్టు తేలింది. ఘటనా స్థలంలో, రైలులో దొరికిన బ్యాగులో తల కనిపించకపోవడంతో పోలీసులు గాలిస్తున్నారు. ఒడిశాకు చెందిన హయాత్ నిషా భర్తతో విడిపోగా ఆమె మాణిక్ అతడి భార్యతో కలిసి ఉంటోంది. మాణిక్ తనకు తమ్ముడు అవుతాడని, అతడి భార్య మరదలు అవుతుంది నిషా కొందరికి చెప్పినట్టు పోలీసులు విచారణలో గుర్తించారు. ఈ దారుణ ఘటన అటు తమిళనాడులో, ఇటు ఒడిశాలో సంచలనంగా మారింది. విచారణ పూర్తైతే అసలు నిజాలు బయటపడే అవకాశం ఉంది.

## 'రిజర్వేషన్ హటావో'పై చిరాగ్ ఫైర్

మొదటి పేజీ తరువాయి

తరతరాలుగా సామాజిక వివక్షను ఎదుర్కొంటున్న వర్గాలకు అండగా నిలిచేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కు రిజర్వేషన్ అని గుర్తుచేశారు.

సామాజిక న్యాయ సాధనం:

రిజర్వేషన్ అనేది ఏదో ఒక ప్రభుత్వం తన ఇష్టానుసారం ఇచ్చే రాయితీ కాదన్నారు. అది సామాజిక న్యాయం కోసం రాజ్యాంగం అందించిన ముఖ్యమైన సాధనమని చెప్పారు. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) సమాజంలో దీర్ఘకాలంగా వివక్షకు గురయ్యాయని, వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికే ఈ వ్యవస్థను రూపొందించారని తెలిపారు. రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ ఆందోళన బాట పట్టిన విద్యార్థులతో చర్చలు జరిపి రిజర్వేషన్ల ప్రాముఖ్యతను, దాని అవసరాన్ని వారికి వివరించాలన్నారు.

సామాజిక వివక్ష ఇంకా ఉంది:

ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గేకు ఎదురైన ఒక సంఘటనను ప్రస్తావిస్తూ సమాజంలో ఇప్పటికీ వివక్ష కొనసాగుతోందని అందుకే సామాజిక న్యాయంపై చర్చలు నిరంతరం అవసరమని పాశ్వాన్ అభిప్రాయపడ్డారు.

## సురేఖకు ఓబీసీ అండ!

మొదటి పేజీ తరువాయి

కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని ఆయన వ్యాఖ్యానించారు. "పెద్దరికం చేసేటప్పుడు భూదేవికి ఉన్నంత ఓపిక ఉండాలి. ఎవరూ ఎవరి మీద కుట్ర పన్నడానికి అవకాశం లేదు. సురేఖ, చిన్నారెడ్డి ఎవరైనా పార్టీకి నష్టం జరగనంత వరకే. పార్టీకి నష్టం జరిగితే కాపాడాల్సిన బాధ్యత పీసీసీపై ఉంటుంది. సీఎం రాగానే సమస్యను పరిష్కరించుకోవచ్చు. పార్టీ ఉంటేనే మనం.. పార్టీ లేకుంటే ఎవరూ లేరు" అని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.


ఓబీసీ సంఘం ఎంట్రీ.. మరింత హీట్:

మరోవైపు మంత్రి కొండా సురేఖకు మద్దతుగా ఓబీసీ సంఘం రంగంలోకి రావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కొండా సురేఖపై రాజకీయ కుట్ర జరుగుతోందని ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్ ఆరోపించారు. కొండా సురేఖ రాజకీయ భవిష్యత్‌ను దెబ్బతీసేలా కొందరు కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. క్రమశిక్షణా నోటీసుల అంశంపైనా శివ ముదిరాజ్ ప్రశ్నలు సంధించారు. సురేఖ ఇప్పటికే నోటీసులకు వివరణ ఇచ్చారని, మరి ఇతర కాంగ్రెస్ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాజగోపాల్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చే దమ్ముందా? అనిరుధ్ చేసిన వ్యాఖ్యలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని ఆయన ప్రశ్నించారు. కొండా సురేఖకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని శివ ముదిరాజ్ హెచ్చరించారు.

సీఎం రేవంత్ రాకతో వివాదం ముగిసేనా?:

ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో.. ఆయన తిరిగి వచ్చిన తర్వాతే ఈ వ్యవహారంపై పార్టీ నాయకత్వం ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. కాంగ్రెస్‌లో అధికారం, పదవులు, వర్గ సమీకరణాలతో పాటు.. పార్టీ అంతర్గత క్రమశిక్షణ అంశం కూడా ఈ వివాదంతో ముడిపడింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి రాక తర్వాత అసమ్మతి--సమ్మతి వర్గాల మధ్య నెలకొన్న విభేదాలకు ఎలాంటి పరిష్కారం చూపుతారన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీకి నష్టం కలగకుండా విభేదాలను చక్కదిద్దుతారా? లేక క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తారా? అన్నదే ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## మోడీ పిలుపు.. స్పేస్‌లో దూసుకెళ్దాం!



న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మరింత పెద్ద కలలు కంటూ, మరెన్నో ఆవిష్కరణలు చేస్తూ, సరికొత్త సరిహద్దులను విస్తరిద్దాం అంటూ ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నిన్న సేవా తీర్థ్‌లో అంతరిక్ష రంగానికి చెందిన 20 స్టార్టప్‌ల సీఈవోలు, వ్యవస్థాపకులతో సమావేశమయ్యారు. భారత్‌లో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష రంగం, కొత్త సాంకేతికతలు, ఆవిష్కరణలు, భవిష్యత్ అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి సంబంధించిన వీడియోను జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ వేగంగా పురోగమిస్తోందని, ముఖ్యంగా ప్రైవేట్ అంతరిక్ష సంస్థల భాగస్వామ్యం పెరగడంతో గ్లోబల్ ఇన్వెస్టర్లకు భారతదేశం ఒక పెట్టుబడుల కేంద్రంగా మారిందని ఈ సందర్భంగా అన్నారు.

## రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్!

మొదటి పేజీ తరువాయి

మాట్లాడితే ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అనే మీరు.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా? ఇదేనా మీరు చెప్పే అంతర్జాతీయ ప్రమాణాలు రేవంత్ రెడ్డి? అని నిలదీశారు.

దళారులపై ఉన్న ప్రేమ చేనేత కార్మికులపై ఏది?:

రాష్ట్రంలో ఒకచోట యూనిఫారాలు అందలేదు.. అందినచోట కొలతలు సరిగ్గా లేవు. కుట్లు ఊడిపోతున్నాయి.. ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయి. రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా, చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదని హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ.. తెలంగాణ చేనేత కార్మికులపై లేదని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి.. కమీషన్ల కోసం బడా కార్పొరేట్ల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి విద్యార్థులకు, చేనేత కార్మికులకు అన్యాయం చేశారని విమర్శించారు.

విచారణ జరిపించండి:

"మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు" అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? అని హరీశ్ రావు నిలదీశారు. ఒకవైపు చేనేత కార్మికుల ఉపాధికి గండి.. మరోవైపు విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు.. దీంతో విద్యార్థులకు కష్టం.. చేనేత కార్మికులకు ఉపాధి నష్టం అన్నారు. నాసిరకం యూనిఫామ్‌లపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## కంపించిన జపాన్.. భయంతో జనం!



న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): జపాన్‌ను భారీ భూకంపం వణికించింది ఆదివారం తెల్లవారుజామున 2 గంటలల సమయంలో భారీ భూకంపం సంభవించింది. తూర్పు జపాన్‌లోని ఇబారకి ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రతతో భూమి కంపించింది. భూకంప కేంద్రం భూమికి సుమారు 68 నుంచి 70 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇబరాకి, సైతామా, చిబా, టోక్యో సహా పలు ప్రాంతాల్లో గరిష్ఠంగా 5 లోయర్ తీవ్రత నమోదైంది. భూకంపం కారణంగా ఇప్పటివరకు 25 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది. గాయపడిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. అయితే ఈ భూకంపం వల్ల ఎలాంటి సునామీ ప్రమాదం లేదని మరియు ప్రాంతంలోని అణు విద్యుత్ కేంద్రాలు సురక్షితంగా ఉన్నాయని అధికారులు స్పష్టం తెలపడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పగిలిన రోడ్లు.. నిలిచిన విద్యుత్

భూకంపం కారణంగా టోక్యోలోని కోటో వార్డులో భూగర్భ మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లు పగిలిపోయాయి. ఇక పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. టోక్యో, నరితా విమానాశ్రయాన్ని అనుసంధానించే ఎక్స్ ప్రెస్ రైళ్లు, స్థానిక రైలు సర్వీసులలో అంతరాయం ఏర్పడింది.

## హైదరాబాద్‌కు వచ్చాక అన్నీ చెబుతా!



న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు బయలుదేరారు. కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడం వల్లనే తన అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. యూకే, యూఎస్ పర్యటనలకు ప్రభుత్వం ముందుగానే అనుమతులు కోరినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కేవలం లండన్ పర్యటనకే క్లియరెన్స్ ఇచ్చి, అమెరికా పర్యటనకు 'రాజకీయ కోణం' చూపిస్తూ అనుమతి నిరాకరించిందని సీఎం తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గళమెత్తి సీఎం రేవంతు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఖర్గేకు రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

లండన్ పర్యటన సక్సెస్..

తన లండన్ పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాలు, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో తెలంగాణకు కీలకమైన భాగస్వామ్యాలు కుదిరాయని పేర్కొన్నారు. మరికొద్ది గంటల్లోనే తాను హైదరాబాద్‌కు చేరుకుంటానని, హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత కేంద్రం వైఖరి, పూర్తి అంశాలపై సవివరంగా మాట్లాడతానని సీఎం వెల్లడించారు.

## టీ కాంగ్రెస్‌లో పదవుల పండుగ!

మొదటి పేజీ తరువాయి

కొత్త నేతలకు 20 శాతం అవకాశం



పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త నాయకత్వాన్ని కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని టీపీసీసీ చీఫ్ పేర్కొన్నారు. అందులో భాగంగా మిగిలిన 20 శాతం నామినేటెడ్ పదవులను కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలు, పార్టీ భవిష్యత్తుకు ఉపయోగపడే నాయకులకు కేటాయిస్తామని చెప్పారు. గతంలో పదవుల పంపకంలో కొన్ని చిన్నపాటి తప్పిదాలు జరిగాయని అంగీకరించిన ఆయన.. ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

క్రమశిక్షణే ప్రధాన ప్రామాణికం

నామినేటెడ్ పదవుల ఎంపికలో సిఫారసులు, ఇతర అంశాల కంటే పార్టీ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, కష్టపడే తత్వానికే అధిక ప్రాధాన్యత ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల సేవలను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో చాలా కాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు చిగురించాయి.

100కుపైగా సీట్లే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కార్యకర్తల పాత్ర కీలకమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కార్యకర్తల త్యాగాలు, నిరంతర శ్రమతోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో 100కుపైగా స్థానాలు గెలుచుకుని మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కార్యకర్తల్లో పెరిగిన ఆశలు

నామినేటెడ్ పదవుల భర్తీపై టీపీసీసీ అధ్యక్షుడు చేసిన ప్రకటనతో పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. సెప్టెంబర్‌లో భర్తీ ప్రక్రియ పూర్తవుతుందని ప్రకటించడంతో ఆశావహుల్లో పదవులపై చర్చ మొదలైంది. నిజామాబాద్ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## చక్కెర ధరలతో జనం విలవిల!



న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): మార్కెట్లో చక్కెర ధర చుక్కలనంటడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూడు రోజుల క్రితం కిలో రూ.50 పలికిన చక్కెర ఆదివారం 75 రూపాయలకు ఎగబాకింది. నిరుపేద కూలీల నుంచి ఉన్నత స్థాయి వర్గాల ప్రజలు నిత్యం ఉపయోగించే చక్కెర రోజుల వ్యవధిలోనే అమాంతం ధరలు పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్లో చక్కెర నిల్వలు తగ్గడంతోనే వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

సాధారణంగా కిలోకు 45-50 ధర పలికే షుగర్ రూ.75కి చేరడంతో పలువురు హోటళ్ల యజమానులు టీ ధరలు అమాంతంగా పెంచేశారు. నాలుగు రోజుల క్రితం పది రూపాయలు ఉన్న టీ ధర నేడు 15కి చేరింది. దీంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో నిత్యావసర సరుకులు అయిన పప్పులు నూనెల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు విలవిల్లాడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిత్యావసర సరుకులు ధరలు క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని లింగంపేట మండల ప్రజలు కోరుతున్నారు.

## గచ్చిబౌలి బిల్డర్ బాగోతం బట్టబయలు!



న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కూలిన ఘటనతో బిల్డర్ సాజిద్ ఖాన్ అక్రమ నిర్మాణాల దందా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు, అతను నిర్మించిన భవనాలన్నీ పూర్తిస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా సాగిన అక్రమ నిర్మాణాలని తేల్చిచెప్పారు. గతంలో ఓ సాధారణ మెకానిక్‌గా జీవితాన్ని ప్రారంభించిన సాజిద్ ఖాన్, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో సైబరాబాద్ వ్యాప్తంగా అక్రమ నిర్మాణాల సామ్రాజ్యాన్నే సృష్టించాడు. అత్యంత చిన్న స్థలాలను కొనుగోలు చేసి, అధికారులకు లంచాలు ఎరవేస్తూ పరిమితికి మించిన అంతస్తులను నిర్మించాడు. వాటిని పీజీ హాస్టళ్లుగా మర్చి, అమాయక విద్యార్థులు, ఉద్యోగుల నుంచి భారీగా అద్దెలు వసూలు చేస్తూ అనతికాలంలోనే కోట్ల రూపాయలు సంపాదించాడు.

బిల్డర్ సాజిద్ అక్రమాలపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉన్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ పరిధిలో సాజిద్ నిర్మించిన అన్ని అక్రమ కట్టడాలపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు, అతని అక్రమ వ్యాపారానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల జాబితాను కూడా మున్సిపల్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. ఇక మరోవైపు, ప్రమాద స్థలంలో శిథిలాల తొలగింపు ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం నేలమట్టం అయిన బిల్డింగ్ శిథిలాలు తొలగించిన తర్వాత వెనక ఉన్న అక్రమ కట్టడం జి+6 భవనం కూల్చివేయనున్నారు. ఇప్పటికే జయదర్శిని అపార్ట్ మెంట్ సి బ్లాక్ వాసులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. బిల్డింగ్ యజమాని సాజిద్ పరారీలో ఉన్నాడు. ఇప్పటికే సాజిద్‌పై కేసు నమోదు చేశారు.

## కవిత పార్టీకి గ్లోబల్ టచ్!

న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బలోపేతం కోసం 14 దేశాల్లో పార్టీ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 దేశాలతో పాటు పార్టీ మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిని నియమించారు. ఆయా దేశాల్లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వారి నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు.

వివిధ దేశాలకు నియమించిన అధ్యక్షుల వివరాలు:

ఆస్ట్రేలియా: కిషోర్ కత్తి
యూకే: సుమన్ రావు బాల్మూరి
కెనడా: వెంకట్రామణ్ మెట్ పల్లి
ఇటలీ: తానింకి కిషోర్ యాదవ్
మాల్టా: పింటూ ఘోష్
పోర్చుగల్: ప్రకాష్ పొన్నకంటి
యూఏఈ: శేఖర్ గౌడ్ ఆరె
కువైట్: మార్క ప్రమోద్ గౌడ్
జింబాబ్వే: బెమ్మడి మహేందర్ రెడ్డి
ఖతార్: శేఖర్ చిలువూరి
ఫిన్లాండ్: సందీప్ రెడ్డి ఐరెడ్డి
నార్వే: ప్రసాద్ రావు బిక్కినేని
సౌదీ అరేబియా: మొజ్జం అలీ ఇఫ్తేకర్
ఐర్లాండ్: జయంత్ రెడ్డి మెట్టు

దీంతో పాటు టీఆర్ఎస్ మహారాష్ట్ర శాఖ రాష్ట్ర అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్‌ను నియమించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

## మల్లారెడ్డి కాలేజీపై కేసు నమోదు.. 'టాక్సిక్' ఈవెంట్‌లో అసలేం జరిగింది?



న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (బిఎన్ఎస్): హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో శనివారం రాత్రి నిర్వహించిన కన్నడ స్టార్ హీరో యశ్ 'టాక్సిక్' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్లో తీవ్ర అపశృతి చోటుచేసుకుంది. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో యూనివర్సిటీ యాజమాన్యం, ఈవెంట్ మేనేజర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున అభిమానులు, విద్యార్థులు హాజరయ్యారు. వేదిక సమీపంలో క్రౌడ్ విపరీతంగా పెరగడంతో కొంతమంది యువకులు క్లియర్ వ్యూ కోసం ఫ్లడ్ లైట్ స్తంభాలు, భారీ సౌండ్ బాక్సులకు అమర్చిన ఐరన్ పోల్స్‌పైకి ఎక్కారు. ఈ క్రమంలో బరువు ఎక్కువై భారీ సౌండ్ బాక్స్ అమర్చిన ఒక పోల్ ఉన్నపళంగా కిందపడిపోయింది.

మధ్యలోనే ప్రసంగాన్ని ఆపేసిన యశ్..

ఈ ప్రమాదం జరిగే సమయంలో హీరో యశ్ వేదికపై మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పోల్ పడిపోవడాన్ని గమనించిన ఆయన వెంటనే ప్రసంగాన్ని ఆపేసి కంగారుగా స్పందించారు. "అక్కడ అందరూ సురక్షితంగానే ఉన్నారా? ఏమైందో చూడండి" అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా లైటింగ్ స్టాండ్లు, మైక్ పోల్స్ ఎక్కిన యువకులను వెంటనే కిందకు దిగాలని వేదికపై నుంచే కోరారు. ఈ దుర్ఘటనలో గాయపడిన ఇద్దరు యువకులను పోలీసులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వేలాది మంది వచ్చే ఈవెంట్లో భద్రత, గుంపు నియంత్రణ నిబంధనలు పాటించనందుకే ఈ ప్రమాదం జరిగిందని భావించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్షేమానికి వెలుగుబాట.. 'గృహజ్యోతి'



విద్యుత్ ఇప్పుడు సౌకర్యం కాదు.. నిత్య జీవినావసరం. ఇంట్లో దీపం వెలగడం నుంచి పిల్లల చదువులు, మహిళల గృహ నిర్వహణ, చిన్నతరహా ఉపాధి కార్యకలాపాల వరకు ప్రతి అడుగులోనూ విద్యుత్ అంతర్భాగమైపోయింది. అలాంటి విద్యుత్ బిల్లుపై ఉపశమనం అంటే ఒక కుటుంబానికి కేవలం ఒక ఖర్చు తగ్గడం కాదు.. ఆ కుటుంబ ఆర్థిక వ్యవస్థకు కొంతమేర ఊతం లభించడమే అనిచెప్పాలి. ఈ సామాజిక వాస్తవాన్ని గుర్తించిన తెలంగాణ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 'గృహజ్యోతి' పథకం.. సంక్షేమ పాలనలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది.

ప్రజల కష్టాలను కేవలం గణాంకాల్లో కాకుండా.. క్షేత్రస్థాయిలో, ప్రజల మధ్య ఉండి ప్రత్యక్షంగా చూసిన అనుభవం నుంచి పుట్టిన ఆలోచనే గృహజ్యోతి. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా నేటి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వందల కిలోమీటర్లు మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా కాలినడకన ప్రయాణిస్తూ వందలాది గ్రామాలను సందర్శించారు. రైతులను కలిశారు. కూలీలతో మాట్లాడారు. మహిళల ఆవేదనలు విన్నారు. పేదల గుడిసెల్లోకి వెళ్లారు. ఆదివాసీ కుటుంబాల సమస్యలను తెలుసుకున్నారు. నిప్పులుచిమ్మే ఎండలను లెక్కచేయకుండా సాగిన ఆ పాదయాత్ర కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు.. ప్రజల జీవితాలను ప్రత్యక్షంగా చదివిన ఒక సామాజిక అధ్యయనంగా చెప్పవచ్చు.

ఆ యాత్రలో కనిపించిన ప్రజా సమస్యల్లో విద్యుత్ భారం కూడా ఒకటి. పరిమిత ఆదాయంతో కుటుంబాన్ని నడిపించే పేద, మధ్యతరగతి కుటుంబానికి నెలనెలా వచ్చే విద్యుత్ బిల్లు ఆర్థిక భారంగా మారుతుంది. ఈ పరిస్థితులను భట్టి విక్రమార్క నాడు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ సందర్భంలోనే పేదలకు 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ పక్షాన హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం ఎన్నికల ప్రకటనలుగా కాకుండా.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆచరణాత్మక సంక్షేమ విధానాలుగా మార్చాలన్న సంకల్పం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విధానంలో కనిపిస్తోంది. అందులో భాగంగానే 'గృహజ్యోతి' అమలులోకి వచ్చింది.

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల విద్యుత్ భారాన్ని తగ్గించాలన్న సంకల్పం ఒక స్పష్టమైన సంక్షేమ విధానంగా రూపుదిద్దుకుంది. దాని ఫలితమే నేడు లక్షలాది కుటుంబాలకు అందుతున్న 'జీరో బిల్లు'. పథకం ప్రారంభమైన సమయంలో 42.42 లక్షలుగా ఉన్న గృహ విద్యుత్ వినియోగదారుల సంఖ్య.. 2026 ఆగస్టు నాటికి 54.37 లక్షలకు చేరింది. అదే నెలలో 50.36 లక్షల మంది వినియోగదారులు జీరో బిల్లులు పొందడం .. పథకం ఎంత విస్తృతంగా ప్రజలకు చేరుతోందో తెలియజేస్తోంది. ఈ పదకం ప్రారంభం అయినప్పటినుంచి ఆగస్టు 2026 వరకు 13.91 కోట్ల 'జీరో బిల్లులు' గృహ జ్యోతి వినియోగదారులు పొందడం జరిగింది

ఇది కేవలం సంఖ్యల పెరుగుదల కాదు. ఆ గణాంకాల వెనుక లక్షల కుటుంబాల జీవితాలు ఉన్నాయి. ఒక ఇంటికి నెలకు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లు లేకపోవడం.. ఆ కుటుంబానికి మరో అవసరానికి కొంత సొమ్ము మిగలడమే. ఆ సొమ్ము పిల్లల పుస్తకాలకు కావచ్చు. ఇంటి నిత్యావసరాలకు కావచ్చు. మందులకు కావచ్చు. మహిళల అవసరాలకు కావచ్చు. చిన్న వ్యాపారానికి కావచ్చు. మొత్తంగా చూస్తే.. విద్యుత్ బిల్లుపై ఆదా అయిన ప్రతి రూపాయి కుటుంబ ఆర్థిక వ్యవస్థలోనే తిరిగి చలామణి అవుతుంది. సంక్షేమం అంటే ప్రజలను ప్రభుత్వంపై ఆధారపడేలా చేయడం కాదు. వారి జీవన వ్యయాన్ని తగ్గించి, పరిమిత ఆదాయంతో మెరుగైన జీవన ప్రమాణం సాధించే అవకాశం కల్పించడం. ఆ దిశగా చూస్తే గృహజ్యోతి ఒక ముఖ్యమైన సామాజిక భద్రతా చర్యగా కనిపిస్తుంది.

గృహజ్యోతి పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ కూడా గణనీయమైనదే. 2024 మార్చి నుంచి 2026 ఆగస్టు వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.5,066 కోట్లకు పైగా సబ్సిడీని విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వానికి ఇది ఆర్థిక బాధ్యత కావచ్చు. కానీ ప్రజలకు మాత్రం అది ఆర్థిక భరోసా. ఆదాయానికి, జీవన వ్యయానికి మధ్య అంతరం పెరుగుతున్న సమయంలో ఇలాంటి ప్రత్యక్ష ఉపశమన చర్యలు సామాన్య కుటుంబాలపై పడే భారాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

సంక్షేమ పథకాలపై చర్చ వచ్చిన ప్రతిసారీ 'ప్రభుత్వ ఖజానాపై భారం' అనే వాదన వినిపించడం సహజంగా మారింది. ప్రతి వ్యయాన్ని ఒకే కోణంలో చూడటం సరైంది కాదు. ఒక కుటుంబం విద్యుత్ బిల్లుపై ఆదా చేసిన సొమ్ము తిరిగి అదే కుటుంబం ఆర్థిక వ్యవస్థలోకి వెళ్తుంది. అది విద్య, ఆరోగ్యం, ఆహారం, దుస్తులు, లేదా ఇతర గృహ అవసరాలపై ఖర్చవుతుంది. తద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు చలనం వస్తుంది. అంటే ప్రజల జీవన ప్రమాణాన్ని నిలబెట్టే సామాజిక పెట్టుబడిగా కూడా సంక్షేమ వ్యయాన్ని చూడాల్సిన అవసరం ఉంది.

అందుకే సంక్షేమాన్ని ఖజానాపై భారంగా కాకుండా సామాజిక పెట్టుబడిగా చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విద్యుత్ వంటి ప్రాథమిక అవసరంపై ఉపశమనం కల్పించడం ప్రజల జీవన ప్రమాణాన్ని నిలబెట్టే సామాజిక భద్రతా చర్యగా భావించాలి. సంక్షేమ పథకం విజయాన్ని ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులతో మాత్రమే కొలవలేం. ఆ పథకం వల్ల ఎంతమంది కుటుంబాలకు ఊరట లభించింది? ఎంతమంది పిల్లల చదువుకు తోడ్పడింది? ఎంతమంది కుటుంబాల నెలవారీ బడ్జెట్‌లో కొంత వెసులుబాటు వచ్చింది? ఎంతమంది పేదల కొనుగోలు శక్తి కాపాడబడింది? అనే ప్రశ్నలే అసలు ప్రమాణాలు. ఆ దృష్టితో చూస్తే 'గృహజ్యోతి' కేవలం ఉచిత విద్యుత్ పథకం కాదు.. కుటుంబ ఆర్థిక భద్రతకు ఒక చిన్న వెలుగు. ఆ వెలుగు లక్షల ఇళ్లకు విస్తరించినప్పుడు అది ఒక పథకాన్ని మించి ఒక సామాజిక భరోసాగా మారుతుంది.

పీపుల్స్ మార్చ్‌లో ప్రజల మధ్య కనిపించిన కష్టాలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత విధానాలుగా, పథకాలుగా మారుతున్నాయనడానికి గృహజ్యోతి ఒక ఉదాహరణ. ప్రజల బాధను దగ్గరగా చూసిన పాలన.. ఆ బాధను తగ్గించే నిర్ణయాలుగా మారినప్పుడే సంక్షేమానికి సార్థకత. ఇంట్లో వెలిగే దీపం కేవలం చీకటిని పారద్రోలదు.. ఆ ఇంటి ఆశలను కూడా వెలిగిస్తుంది. లక్షల కుటుంబాల విద్యుత్ బిల్లులపై ఆర్థిక చీకటిని తొలగిస్తూ.. వారి జీవనంలో కొంత వెలుగును 'గృహజ్యోతి' నింపుతోంది.. గృహజ్యోతి పథకం పేదల జీవితాల్లో సంక్షేమానికి వెలుగుబాటగా మారుతోంది.



చామిరాజు శేషు బాబు
డిప్యూటీ సీఎం పిఆర్ఓ

# మహిళలు మార్గదర్శకులుగా ఎదగాలి: జస్టిస్ లీసా గిల్

## డీఎస్ఎన్ఎల్‌యూలో నూతన వసతి గృహం, రెండు అత్యాధునిక సమావేశ మందిరాల ప్రారంభం






విశాఖపట్నం: విద్యార్థి దశ నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా అంకితభావంతో ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కులపతి జస్టిస్ శ్రీమతి లీసా గిల్ సూచించారు. శనివారం ఆమె విశ్వవిద్యాలయాన్ని సందర్శించి నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహంతో పాటు రెండు అత్యాధునిక సమావేశ మందిరాలను ప్రారంభించారు. అనంతరం వివిధ విభాగాలను, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు.


న్యాయవాద వృత్తిలో మహిళల పాత్రపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిస్తూ, న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతోందన్నారు. పంజాబ్, హర్యానా హైకోర్టులో సుమారు 70 శాతం మంది న్యాయవాదులు మహిళలు ఉన్నారని, పలు రాష్ట్రాల హైకోర్టుల్లో సుమారు 65 శాతం మంది మహిళా న్యాయవాదులు ఉన్నారని తెలిపారు. మహిళలు ఎదుర్కొనే అడ్డంకులు వారి ఆశయాలకు పరిమితులు కాకూడదని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు.

మొదటి తరం న్యాయవాదులు ఎదుర్కొనే సవాళ్లను అంకితభావం, పట్టుదలతో అధిగమించవచ్చన్నారు. న్యాయ విద్యార్థులు మంచి సివిల్ సర్వెంట్లుగా ఎదగగలరని, న్యాయ పరిజ్ఞానం చట్టాల అమలులో, శాంతిభద్రతల పరిరక్షణలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అనంతరం జనరల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ఉపకులపతి ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు జస్టిస్ లీసా గిల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య, మాజీ న్యాయమూర్తి సోమయాజులు, మోహన్ గోపాల్, రిజిస్ట్రార్ ఇన్‌చార్జి విశ్వచంద్రనాథ్ మాదాసు, అకడమిక్ డైరెక్టర్ సోమా భట్టాచార్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇది ముమ్మాటికి జెన్ జెడ్ మాటున దేశద్రోహులు చేసిన పనే.!!

## కడపజిల్లా బిజెపి అధ్యక్షుడు జంగిటి సుబ్బారెడ్డి.




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 23: కడప నగరం, ఎర్రముక్కపల్లె సర్కిల్‌లోని లక్ష్మీ తులసి క్వాలిటీ ఫ్యూయల్ (బిపిసిఎల్) పెట్రోల్ బంక్ లో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రం బ్యానర్ పై అభ్యంతరకరమైన నినాదాలు, సందేశాలతో పోస్టర్లు, స్టిక్కర్లు అంటించడం దారుణం అంటూ కడపజిల్లా బిజెపి అధ్యక్షుడు జంగిటి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇది ముమ్మాటికి జెన్ జెడ్ మాటున దేశ ద్రోహులు చేసిన పని అంటూ దేశాన్ని విచ్ఛిన్నం చేయడం, దేశంలో అలజడులు సృష్టించడమే దేశ ద్రోహుల పని అన్నారు. దేశ ద్రోహులు చేసే ప్రతి పనిని భారతదేశ యువత మీద రుద్దడం దేశ ద్రోహులకు ఆనవాయితీ అయిందన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ప్రజలకు సేవలందించే పెట్రోల్ బంక్ వంటి పబ్లిక్ ప్రదేశంలో వివాదాస్పద ప్రచార సామగ్రి ఏర్పాటు చేయడం సముచితం కాదన్నారు.

ఈ పోస్టర్లు, స్టిక్కర్లు ఎవరి అనుమతితో ఏర్పాటు చేశారో విచారణ ద్వారా తేల్చాలన్నారు. పెట్రోల్ బంక్ డీలర్ లేదా సిబ్బందికి ఈ వ్యవహారంతో సంబంధం ఉందా? అనే అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలి అంటూ గత 20 రోజులుగా భారత ప్రధాని నరేంద్ర మోడీ బ్యానర్ పైన స్టిక్కర్లు ఉన్నాయని, పెట్రోల్ బంకు సిబ్బందే స్వయానా తెలియ జేస్తున్నారన్నారు. దీన్నిబట్టి చూస్తే భారత్ పెట్రోల్ బంక్ యాజమాన్యానికి ఈ విషయం మీద ఎంత నిర్లక్ష్యమో అర్థం అవుతుంది అన్నారు. బీపీసీఎల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే సంబంధిత పెట్రోల్ బంకు పై తగిన చర్యలు తీసుకోవాలి.

భవిష్యత్తులో బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ప్రాంగణాలను వివాదాస్పద లేదా అభ్యంతరకర ప్రచారానికి ఉపయోగించకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలి అన్నారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే భారత్ పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, లైసెన్స్ పై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కడప జిల్లా బిజెపి అధ్యక్షుడు జంగిటి సుబ్బారెడ్డి తెలిపారు.

# తాళ్లరేవు పెంకే కాలనీలో తెల్లవారుజామున అగ్నిప్రమాదం.. తప్పిన ప్రాణ నష్టం



తాళ్లరేవు (బిఎన్ఎస్ ) ఆగస్టు 23: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెంకే కాలనీలో జరిగిన ఈ ప్రమాదంలో రెండు తాటాకిళ్లు, ఓ బడ్డీ దుకాణం పూర్తిగా దగ్ధమయ్యాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.తాళ్లరేవు మండలం పెంకే కాలనీలో తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు వేగంగా వ్యాపించడంతో బచ్చ లక్ష్మి, పోతా బత్తుల రాజమ్మకు చెందిన రెండు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.....ఇదే సమయంలో పక్కనే ఉన్న బడ్డీ దుకాణం కూడా మంటల్లో కాలిపోయింది. ఇళ్ల సమీపంలో ఉంచిన టెంట్ హౌస్ సామాగ్రి సైతం అగ్నికి ఆహుతైంది.మంటలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు....అగ్నిప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం ఎంతమేర జరిగిందన్న పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది.

# నవాబుపేటలో ఇంటింటికి తెలుగుదేశంపార్టీ కరపత్రాలు పంపిణీ



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్): –నెల్లూరు జిల్లా రాపూరు మండలం రాపూరు పంచాయతీ పరిధిలోని నవాబుపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లవ డ్ల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాలతో, రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చె న్ను అశోక్ రెడ్డి సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు పచ్చి గల రత్నయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య మాదిగ, సమయం ప్రసాద్, అడసనపల్లి వేమయ్య, బూత్ కన్వీనర్ వెంకయ్య, నాగార్జున, నరసయ్య, జయమ్మ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.

# 2028 ఆగస్టు నాటికి ఎస్ ఎల్ బి సి సొరంగం పనుల పూర్తి: మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ (బిఎన్ఎస్): ఆగస్టు 2028 నాటికి ఎస్ ఎల్ బి సి సొరంగ పనులను పూర్తి చేసి శ్రీశైలం నుంచి నేరుగా కృష్ణా జలాలను జిల్లాకు తీసుకువస్తామని రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు... గతంలో 2 వేల కోట్లున్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రస్తుతం 5 వేల కోట్లకు పెరిగిందని, అయినప్పటికీ ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి చెప్పారు.

నల్లగొండ పట్టణ కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం మంత్రి మాట్లాడుతూ... నల్లగొండను అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు 1,400 కోట్ల రూపాయల విలువైన పనులు చేపట్టామని, పట్టనాభివృద్ధిలో భాగంగా 900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు.. మరో 300 కోట్లతో అండర్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డబల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలి: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి.



సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లకు ఇటీవల నూతనంగా నియమితులైన బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఆదివారం తార్నాకలోని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు C.అరవింద్, నార్తులాలగూడ డివిజన్ అధ్యక్షుడు A. నటరాజ్, తార్నాక డివిజన్ అధ్యక్షుడు K. కరుణాకర్ తదితరులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్తీక రెడ్డి మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రజాసమస్యలపై నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగాస్టార్ చిరంజీవి పేరున నిత్య అన్నదానానికి విరాళం

## మెగాస్టార్ వీరాభిమాని అమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య వితరణ.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 23: మాజీ కేంద్రమంత్రి మెగాస్టార్ కొణిదెల చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన వీరాభిమాని బ్రహ్మంగారిమఠం మండల కాపునాడు ఉపాధ్యక్షుడు సీనియర్ విలేకరి అంబిశెట్టి వెంకటసుబ్బయ్య శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకుని మెగాస్టార్ చిరంజీవి పేరు మీదగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి తెలుగు సినీ పరిశ్రమలో మెగాస్టార్‌గా కోట్లాది మంది అభిమానుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న చిరంజీవి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని, వారు ఆకాంక్షించారు వారికి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన పేరుతో ప్రతి సంవత్సరం అన్నదానం కొనసాగించేలా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం శాశ్వత నిత్య అన్నదాన పథకానికి నగదు విరాళాన్ని అందజేశారు.

అనంతరం మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు మఠాధిపతి సోదరుడు శ్రీ దత్తాత్రేయ స్వాములవారి చేతుల మీదుగా విరాళానికి సంబంధించిన రసీదును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించిన ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ




ముమ్మిడివరం (బిఎన్ఎస్ )ఆగస్టు 23: ఓడలరేవుకు చెందిన ఫిషింగ్ బోటు అదృశ్యమై సుమారు 20 రోజులు గడుస్తున్నా అందులో ప్రయాణించిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభించకపోవడంతో వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలోని పశువుల్లంకకు చెందిన కాటాడి సతీష్, బలుసుతిప్పకు చెందిన సంగాని తాతారావుతో పాటు ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం ప్రాంతాలకు చెందిన మొత్తం ఏడుగురు మత్స్యకారులు ఈ బోటులో ట్యూనా చేపల వేటకు వెళ్లినట్లు పొన్నాడ తెలిపారు.

సాధారణంగా ట్యూనా చేపల వేట కోసం సముద్రంలో 150 నుంచి 200 కిలోమీటర్ల వరకు లోపలికి వెళ్లాల్సి ఉంటుందని, చేపల లభ్యతను బట్టి తిరిగి రావడానికి 10 నుంచి 15 రోజులు, ఒక్కోసారి 20 నుంచి 25 రోజులు కూడా పట్టే అవకాశం ఉంటుందని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారని ఆయన వివరించారు.

అయితే ప్రస్తుతం సుమారు 20 రోజులు గడిచినా బోటు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశాన్ని దృష్టిలోకి తీసుకుని సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించిందని చెప్పారు.

అదృశ్యమైన మత్స్యకారులు సముద్రంలో చేపల వేటలో ఎంతో అనుభవం ఉన్న సీనియర్ మత్స్యకారులని పొన్నాడ పేర్కొన్నారు. బోటుకు ఏదైనా సాంకేతిక సమస్య ఎదురైనా ప్రాథమిక మరమ్మతులు చేసుకునే సామర్థ్యం వారికుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు కూడా ప్రస్తుతం ప్రతికూలంగా లేకపోవడం కొంత ఊరటనిచ్చే అంశమన్నారు.

అయితే బోటు అనుకోకుండా అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లి ఉండే అవకాశం కూడా ఉందన్న అనుమానాన్ని పొన్నాడ వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితి ఉంటే కేంద్ర ప్రభుత్వం, సంబంధిత దేశ ప్రభుత్వాలతో చర్చించి మత్స్యకారులను సురక్షితంగా తీసుకురావాల్సి ఉంటుందని అన్నారు.

గతంలో శ్రీలంక జలాల్లోకి వెళ్లిన మత్స్యకారుల బోట్ల విషయంలో ఇలాంటి పరిస్థితులు ఎదురైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

మరోవైపు బోటులో సుమారు నెల రోజులకు సరిపడా ఆహార నిల్వలు ఉన్నట్లు సమాచారం ఉందని, ఇది కూడా కొంత ఆశాజనకమైన అంశమని పొన్నాడ తెలిపారు. ప్రభుత్వం సెర్చ్ ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసి మత్స్యకారుల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించాలని కోరారు.

ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పొన్నాడ తెలిపారు. జగన్ సూచనల మేరకు తిరుపతి ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు లేఖలు రాసి వెంటనే సెర్చ్ ఆపరేషన్ చేపట్టాలని కోరినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఏడుగురు మత్స్యకారులు ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా సురక్షితంగా తిరిగి వస్తారని పూర్తి విశ్వాసంతో ఉన్నామని పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందకుండా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని కోరుతూ, మత్స్యకారులు క్షేమంగా తిరిగి వచ్చే వరకు వారికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్): –నెల్లూరు జిల్లాలోని రాపూరు పట్టణంలోని స్థానిక గ్రంధాలయం నందు ఆంధ్ర కేసరి, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హిందూ జాగృతి సేవా సంస్థ అధ్యక్షులు S.R. సురేష్ మాట్లాడుతూ... ప్రకాశం పంతులు గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, రైతు బాంధవుడిగా, సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మహోన్నత సేవలు అందించారని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో మరియు నాటి రాజకీయాల్లో ఆయన చూపిన ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని, ఆయన సేవలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది, పాఠకులు, మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే భూమి లేఅవుట్ కోసం నిరుపేదల గుడిసెలు తొలగింపు

మండపేట(బిఎన్ఎస్)ఆగస్టు 23: మండపేట గత 70 సంవత్సరాలుగా నాలుగు తరాల నుంచి జీవిస్తున్న గుడిసె వాసులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నిరాశ్రయులను చేశారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. పెద్ద కాలువ గట్టు వెంబడి జీవిస్తున్న నిరుపేదల పాకలను ఆదివారం తెల్లవారు జామున మున్సిపల్ అధికారులు తొలగించేందుకు రంగం సిద్ధం చేయగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వైసీపీ శ్రేణులతో కలిసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు తోటకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నిరుపేదల పాకలు జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రొక్లెయిన్ అడ్డంగా వెళ్ళడంతో ఎమ్మెల్సీ తోటను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగుళ్లపై తీవ్ర విమర్శలు చేశారు. గుడిసె వాసులకు దక్షిణ వైపున ఉన్న పది ఎకరాల స్థలంలో లే అవుట్ కు ఎమ్మెల్యే ప్రారంభించారన్నారు. లేఔట్లకు దారి తాము నివాసం ఉన్న పెద్ద కాలువ గట్టు ద్వారా వెళ్లాల్సి ఉంది. దాదాపు 40 మంది కుటుంబాలు 1950 నుంచి మండపేట పట్టణంలో సంపన్నుల నివాస గృహాల్లో పాచి పని చేసుకుని రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో జీవిస్తున్నానన్నారు. నాటి పురపాలక సంఘ చైర్మన్ వేగుళ్ళ వీర్రాజు నుంచి నేడు చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి వరకు తమ జోలికి ఎవరూ రాలేదన్నారు. గతంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ఈ ప్రాంతంలో రైస్ మిల్లు ఉండేదన్నారు. కాలక్రమైనా రైస్ మిల్లు శిథిలం కావడంతో ఈ ప్రాంతం మొత్తాన్ని లేఅవుట్లుగా చేస్తే తన వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని ఎమ్మెల్యే ఆలోచన అన్నారు. దీనికి తోడు వచ్చే ఏడాది నుంచి గోదావరి నదికి పుష్కరాలు రావడంతో ఈ ప్రాంతంలో ఉన్న ఒక చిన్న ప్రైవేటు దేవాలయాన్ని సాకుగా చూపించి ఆ ప్రాంతంలో భక్తుల సౌకర్యార్థం కోసం 30 అడుగుల రహదారిని పుష్కర నిధులతో ఏర్పాటు చేయడానికి ఒక పథకం ప్రకారం వ్యూహరచన చేశారన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలు ఉండటంతో జీ హుజూర్ అన్నట్టుగా కమిషనర్ టీవీ రంగారావు తమకు నోటీసులు పంపారని తెలిపారు. దీనిపై మార్చి నెలలో ఈ విషయంపై తాము ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తకు జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్, కర్నూలులో ఉన్న లోకాయుక్తకు ఎమ్మెల్యే, కమిషనర్లపై ఫిర్యాదు చేశామన్నారు. ఈ మూడు పిటిషన్లు నిన్నటి వరకు పెండింగ్లో ఉందన్నారు. ఇంకా లోకాయుక్త జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ లో ఫిర్యాదులు ఇంకా ఉన్నాయి. వాటినుండి మున్సిపల్ కమిషనర్ కు నోటీసు కూడా రావడం జరిగిందన్నారు. ఈ రెండు న్యాయ సంస్థలు తమ జీవన స్థితిపై అధ్యయనం చేయాలని విచారణ సంస్థలు ఆదేశించాయన్నారు. ఈ నేపథ్యంలో పుష్కర నిధులు వెనక్కు వెళ్లిపోతాయని ఆత్రుతతో ఈ ఇరువురు ఆదివారం తెల్లవారుజామున నాలుగు జేసీబీలతో 200 మంది పోలీసుల బందోబస్తుతో తమ గుడిసెలను నేలమట్టం చేసి రోడ్డున పడేశారని గొల్లుమన్నారు. ఈ సంఘటన జిల్లాలో చర్చనీయాంసంగా మారింది.




# ఆహుతి' మరియు 'హ్యూమానిటీ బియాండ్ ఫియర్' పుస్తకాల ఆవిష్కరణ




భాగ్యనగర్, ఆగస్టు 23, 2026: సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భాగ్యనగర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో త్రిపుర గౌరవనీయ గవర్నర్ శ్రీ ఎన్. ఇంద్రసేన రెడ్డి మరియు ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ శ్రీ సునీల్ అంబేకర్ ముఖ్య అతితులుగా విచ్చేసి మూడు కీలక పుస్తకాలను ఆవిష్కరించారు. సమాచార భారతి అధ్యక్షులు డాక్టర్ గోపాల్ రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఆవిష్కరించిన పుస్తకాల వివరాలు:

సఫ్రాన్ సాక్రిఫైస్ (Saffron Sacrifice): తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలలో దేశ విభజన వాదులకు వ్యతిరేకంగా సంఘ్ స్వయంసేవకులు ప్రాణత్యాగాలు, చేసిన పోరాటాలను డాక్యుమెంట్ చేస్తూ రూపొందించిన ఆంగ్ల పుస్తకం.

ఆహుతి: పైన పేర్కొన్న 'సఫ్రాన్ సాక్రిఫైస్' పుస్తకానికి సంబంధించిన తెలుగు అనువాదం.

హ్యూమానిటీ బియాండ్ ఫియర్ (Humanity Beyond Fear): 1984 మరియు 1985 సంవత్సరాలలో క్లిష్ట పరిస్థితుల్లో సిక్కు సోదరులను రక్షించడంలో సంఘ్ స్వయంసేవకులు చూపిన తెగువ మరియు అందించిన రక్షణకు సంబంధించిన చారిత్రక డాక్యుమెంటేషన్.

దేశం కోసం స్వయంసేవకులు చేసిన త్యాగాలు, మానవతా దృక్పథంతో అందించిన రక్షణ వంటి చారిత్రక సత్యాలను భావితరాలకు తీసుకువెళ్లడంలో ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని వక్తలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో బలిదానం అయిన కుటుంబాలనుండి వారి కుటుంబ సభ్యులు మరియు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా ఆగస్టు 24న పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ

## అన్ని పీజీఆర్ఎస్ కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు క్యూఆర్ కోడ్ ఏర్పాటు

## సేవలు పొందిన అనంతరం అభిప్రాయాలను నమోదు చేయాలి: జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

అమలాపురం,(బిఎన్ఎస్) ఆగస్టు 23 : ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పీజీఆర్ఎస్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆగస్టు 24న జిల్లావ్యాప్తంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు క్యూఆర్ కోడ్

ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో అన్ని పీజీఆర్ఎస్ కేంద్రాల్లో PGRS Citizen Feedback QR Code ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ ద్వారా సేవలు పొందిన అనంతరం ప్రజలు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు.




సేవల నాణ్యత, సమస్య పరిష్కార విధానం, అధికారుల స్పందన తదితర అంశాలపై ప్రజలు అందించే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు, మెరుగుదలలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ప్రజలకు అనుకూలంగా అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

1100, మీకోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు

ప్రజలు పీజీఆర్ఎస్ కేంద్రాల్లో నేరుగా అర్జీలు సమర్పించడంతో పాటు 1100 టోల్‌ఫ్రీ నంబర్, మీకోసం వెబ్‌సైట్ (meekosam.ap.gov.in) ద్వారా కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా 300కు పైగా పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

ప్రజలు తమ సమస్యలను సంబంధిత వేదికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే పీజీఆర్ఎస్ ద్వారా సేవలు పొందిన ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని, ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని నిబంధనల మేరకు పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.

# శ్రావణ మాసం సందర్భంగా అత్తాపూర్ లో వైభవంగా 'కావడి యాత్ర'



బిఎన్ఎస్,అత్తాపూర్:శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అంబియన్స్ పోర్ట్ కాలనీ నుంచి పరమశివుని భక్తులు పవిత్రమైన 'కావడి యాత్ర'ను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గంగా జలాన్ని సేకరించి, రామబాగ్ లోని ప్రముఖ శ్రీ చిన్న అనంతగిరి శివాలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి పవిత్ర గంగా జలంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పవిత్ర యాత్రలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మ్యాడం రామేశ్వర్ రావు, జిల్లా కార్యదర్శి సాబాద విజయ్ కుమార్ తో పాటు ప్రముఖ నాయకులు ఎస్.బి. హరినాథ్, అరవింద్ అగర్వాల్, గణేష్ గుప్త, దీపక్, ధర్మేంద్ర అగర్వాల్, ఓం ప్రకాష్, పంకజ్ అగర్వాల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరమశివుని నామస్మరణతో యాత్ర సాగిన ప్రాంతమంతా శివమయంగా మారింది. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ నాయకులు, నిర్వాహకులు శ్రావణ మాస శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహాన్స్ఆర్య తొట్టెల కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మద్నూర్: కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కుడిచిర గ్రామంలో కుమ్మరి బాలేశం,పెంటవ్వ దంపతుల కుమారుడు పరమేష్, శైలజ దంపతుల పుత్రుడు మహర్షి తొట్టెల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ హాజరై బాలుడు మహర్షిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా చొరవతో అగ్రహారం ఎస్టీ కాలనీలో నూతన రామాలయ నిర్మాణానికి భూమి పూజ



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 23: మైదుకూరు నియోజకవర్గం లోని డి.అగ్రహారం ఎస్టీ కాలనీలో నూతన శ్రీ రామాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమ నిర్వహణలో భాగంగా రేకులకుంట పంచాయతీ పరిధిలోని డి.అగ్రహారం ఎస్టీ కాలనీలో 40 లక్షల టీటీడీ నిధులతో నిర్మించనున్న నూతన శ్రీ రామాలయానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరేలా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని చేసిన కృషికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ మరియు టీటీడీ సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను సాకారం చేయడంలో ఎమ్మెల్యే పుట్టా చూపుతున్న చొరవకు డి.అగ్రహారం ఎస్టీ కాలనీలో నిర్మించనున్న ఈ శ్రీ రామాలయం ఒక ఉదాహరణగా నిలుస్తుందన్నారు. 40 లక్షల టీటీడీ నిధులు సమకూరేలా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేసిన కృషి పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణాన్ని ముందుండి పూర్తి చేయడంతో పాటు, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఆయనకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్న మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులతోపాటు అగ్రహారం ప్రజలు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే భరోసా



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా పిట్లం గ్రామానికి చెందిన రాజు సెట్ రోడ్డు ప్రమాదానికి గురై స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వెంటనే పిట్లం చేరుకుని రాజు సెట్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రామ్ రెడ్డి, పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.